క్లుప్తంగా

హనుమంతావతారంలో వేణుగోపాలుడు


హనుమంతావతారంలో ఊరేగుతున్న స్వామి వారు

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో వేంచేసిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం హనుమంతావారంలో శేషవాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ పూజారి దివి శ్రీధర్ ప్రత్యేక అలంకరణ చేయడంతో పాటు పూజలు చేశారు. అనంతరం విద్యుత్ కాంతులతో అత్యంత వైభవోపేతంగా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఈవో రామకృష్ణారావు పర్యవేక్షించారు.

నేటి నుంచి వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

యర్రగొండపాలెం: స్థానిక మిల్లంపల్లిలో వెలిసిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని దేవస్థానం కమిటీ అధ్యక్షుడు యక్కలి బాలవెంకటేశ్వర్లు తెలిపారు. 12వ తేదీ సాయంత్రం అంకురార్పణం, ధ్వజారోహణం, రాత్రి భేరి పూజ దేవతాహ్వానం, రాయబారం, ఎదురుకోల, తెల్లవారుజామున స్వామి వారి కల్యాణం అన్నమరాజు, యక్కలి వంశీయులతో అంగరంగ వైభవంగా జరుగుతుంది. 13న ఉదయం సూర్య వాహనం, రాత్రి సింహవాహనం, 14న ఉదయ చంద్రవాహనం, రాత్రి శేషవాహనం, 15న రాత్రి హనుమంత వాహనం, 16న రాత్రి గరుడ వాహనం, 17న రాత్రి గజ వాహనం, 18న సాయంత్రం రథోత్సవం, 19న రాత్రి అశ్వ వాహనం, 20న ఉదయం పూర్ణాహుతి, రాత్రి హంస వాహనంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆయన తెలిపారు.

ఆలయాల్లో భక్తుల పూజలు

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల గ్రామం సమీపంలో నల్లమల అడవిలో వెలసిన గంగాభవానీ, వేనూతల కాటమరాజుస్వామి, పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన నాగాంజనేయస్వామి పుట్టకు భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అంకాళమ్మ దేవతకు మహిళలు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

భద్రం.. బ్రదరూ !


టిప్పర్‌పై రెండు అడుగుల మేర నింపిన రాళ్లు

చీమకుర్తి రూరల్: రామాయపట్నం పోర్టు నిర్మాణానికి చీమకుర్తి గ్రానైట్ డంప్‌ల నుంచి పరిమితికి మించి టిప్పర్‌లకు రాళ్లను లోడ్ చేసి తరలిస్తున్నారు. ప్రతి రోజు వందలాది టిప్పర్‌లు చీమకుర్తి నుంచి రామాయపట్నం వెళ్తుంటాయి. ఈ క్రమంలో టిప్పర్‌పైన రెండు అడుగులు వరకు లోడ్ చేయడం వలన రాళ్లు జారి పడే అవకాశం ఉంది. పక్కన వెళ్లే వాహనాలపై పడి ప్రమాదాలు జరుగుతాయని వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా చీమకుర్తి నుంచి ఇతర ప్రాంతాలకు డస్ట్, కంకర, మట్టి రవాణా చేసే టిప్పర్‌లు కూడా వెళ్తుంటాయి. వాటిపై నీళ్లు తడపకుండా, గ్రీన్‌మ్యాట్ లేకుండా తరలిస్తున్నారు. దీని వలన వెనుక వచ్చే వాహనదారుల కళ్లలో పడటం వలన ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సంబంధిత అధికారులు పరిమితికి మించిన లోడింగ్‌లపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.


గ్రీన్ మ్యాట్ లేకుండా వెళ్తున్న టిప్పర్ నుంచి లేస్తున్న దుమ్ము

శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం


విజేతకు బహుమతులు అందిస్తున్న చుండూరి రవిబాబు, నాయకులు

అల్లూరు (కొత్తపట్నం): శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయని ఒంగోలు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా పాల్గొని విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. చుండూరి రవిబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో క్రీడలు ఎంతో యువకులు తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలన్నారు. నెల రోజుల పాటు నిర్వహించిన ఆటలు ఎంతో ఆసక్తినిచ్చాయన్నారు. నెల రోజుల నుంచి జరుగుతున్న వైఎస్సార్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగిశాయి. నెల్లూరు, ప్రకాశం నుంచి 30 టీంలు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఎస్ఆర్‌కే టీం అల్లూరు, మణిరెడ్డి లెవన్స్ ఒంగోలు మధ్య జరగగా ఎస్ఆర్‌కే టీం విన్నర్‌గా నిలిచింది. మొదటి బహుమతిగా చుండూరి రవిబాబు రూ.30 వేలు నగదుతో పాటు కప్‌ను అందించారు. రెండో బహుమతిగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి రూ.20 వేలు నగదుతో పాటు కప్‌ను ఒంగోలు నగరానికి చెందిన మణిరెడ్డి లెవన్స్‌కు, మూడో బహుమతి అల్లూరు గ్రామం ఉప సర్పంచ్ తాటిపర్తి సుబ్బారెడ్డి రూ.15 వేల నగదుతో పాటు కప్ ఒంగోలు నగరానికి చెందిన డీకే లెవన్స్‌కు, నాలుగో బహుమతి జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్, ఎంపీటీసీ సభ్యుడు ఆళ్ల రవీంద్రారెడ్డి రూ.10 వేలతో పాటు కప్‌ను నెల్లూరు జిల్లాకు చెందిన ఏజీఎస్ టీంకు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌ను సాధించిన అల్లూరు గ్రామానికి చెందిన దాసరి మనోజ్‌కు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వీరేపల్లి రామచంద్రారెడ్డి రూ.5,116, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సాధించిన లంకతోటి వంశీకృష్ణకు అంబటి అర్జున్ రూ.5,116 అందజేశారు. కార్యక్రమానికి అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు అధ్యక్షత వహించాడు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్, హరిబాబు, చిట్టిబాబు, అల్లూరు గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నారుల నైపుణ్యాలకు పదను పెట్టాలి


జిల్లా గ్రంథాలయంలో పాల్గొన్న చిన్నారులతో కోటేశ్వరి

ఒంగోలు టౌన్: వేసవి సెలవులను వృథా కానీయకుండా చిన్నారులు తమలోని నైపుణ్యాలకు పదను పెట్టాలని జిల్లా గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి అన్నారు. సెల్ ఫోన్లు, ఆన్‌లైన్ గేములతో విలువైన సమయం పాడైపోతుందని, వాటికి దూరంగా ఉండాలన్నారు. జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాన్ని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. మన కళ్లముందు విజేతలుగా నిలిచిన వారంతా సమయపాలన చేయడం ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. గెలుపోటములను సమానంగా స్వీకరించేలా క్రీడాస్ఫూర్తిని అలవాటు చేసుకోవాలన్నారు. ఆదివారం జిల్లా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా తరగతులు 11వ రోజుకు చేరాయి. 54 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్పోకెన్ ఇంగ్లిషు, పేపర్‌తో గిఫ్ట్ బొమ్మలు తయారు చేయడం, సన్ ఫ్లవర్ చిత్రాలు గీయడం నేర్పించారు. కార్యక్రమంలో ఆర్. బిందుమణి, శిరీషా, టి. రవీంద్ర, టి. శ్రీనివాస రావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం..


విద్యార్థినులకు కరాటే నేర్పిస్తున్న శిక్షకులు

బాలబాలికలు ఆత్మరక్షణలో తర్ఫీదు పొందడం చాలా అవసరమని, ముఖ్యంగా బాలికలు కరాటే నేర్చుకోవడం మంచిదని కరాటే శిక్షకులు చంద్రశేఖర్ చెప్పారు. ప్రకాశం బాలోత్సవం, ఒంగోలు చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఎల్బీజీ భవనంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపులో కరాటేలో శిక్షణ ఇచ్చారు. శత్రువులు తమ మీద దాడి చేసినప్పుడు రక్షించుకునే మెళుకువలను బాలికలకు నేర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రతిరోజు వ్యాయమం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండడమే కాకుండా మానసిక, శారీరక దృఢత్వం పెంపొందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆకృతి అకాడమీ శిక్షకులు షేక్ మహబూబ్, మ్యాజిక్ రామన్, వీరాస్వామి, విజయ్, సీహెచ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలులో కూటమి విఫలం


సమావేశంలో మాట్లాడుతున్న చుండూరి రవిబాబు

నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవిబాబు ధ్వజం

ఒంగోలు సిటీ: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందని ఒంగోలు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని 31, 33 డివిజన్లలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా ఇంతవరకు ఏ ఒక్క పథకం అమలు చేయకుండా ప్రజలను నిట్టనిలువునా మోసం చేసిందని విమర్శించారు. అలాగు కూటమి ప్రభుత్వం పరిపాలనను గాలికొదిలేసి అక్రమ కేసులతో ఇబ్బందులు గురి చేస్తుందని విమర్శించారు. పండించిన పంటలకు కూటమి ప్రభుత్వంలో గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షులు కఠారి శంకరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్, 33వ డివిజన్ అధ్యక్షుడు నాగూర్, కోఆప్షన్ సభ్యులు రషీదా, వైఎస్సార్ సీపీ నాయకులు పాలడుగు రాజీవ్, డి. జయరామిరెడ్డి, నాగూర్ వాసు, ఎస్.వెంకటేశ్వర్లు, సతీష్, మాజీ డివిజన్ అధ్యక్షులు జే మ్స్, కె.శ్రీను, హరిహరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నర్సారెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, పందిటి కాశీరావు, నాగిరెడ్డి, గోపి, కీర్తి, యేసు, నీలాంబరం, నాగలక్ష్మి, మల్లేశ్వరి, రమాదేవి, బాబు, ఆనంద్, బిక్షాలు, రమణ, మహిళా నాయకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదుపు తప్పి బస్సును ఢీకొన్న కారు

నాగులుప్పలపాడు: అతివేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి ట్రావెల్ బస్సును ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. ఈఘటన ఆదివారం సాయంత్రం మద్దిరాలపాడు వద్ద చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చీరాల వైపు నుంచి ఒంగోలుకు వెళ్తున్న కారు మద్దిరాలపాడు గ్రామం వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి వేగం నియంత్రంచలేకపోయింది. దీంతో ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొనడంతో కారులోని ఇరువురికి తీవ్రగాయాలు కావడంతో వారిని ఒంగోలు ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతినడంతో పాటు బస్సు ముందు భాగం దెబ్బతింది.


ప్రమాదంలో ఊడిన బస్సు భాగాలు

తెలంగాణ ఎంసెట్‌లో సరస్వతి విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు సిటీ: తెలంగాణా ఈఏపీసెట్–2025 ఫలితాల్లో సరస్వతి విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారు. 2 వేల లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులు 5 మంది, 5 వేల లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులు 12 మంది, 10 వేల లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులు 21 మంది ఉన్నారు. వారిలో ఆర్.సుకుమార్‌సాయి 577వ ర్యాంకు, కే గుణశేఖర్‌రెడ్డి 592వ ర్యాంకు, కే లోక్ క్రిటి 794వ ర్యాంకు, వీ సాహిత్య 1454వ ర్యాంక్, కే రథసారథి 1759వ ర్యాంకు, ఎస్.ఇంద్రసేనారెడ్డి 2,671వ ర్యాంకు, ఆర్.సాయిమణికంఠారెడ్డి 2,885వ ర్యాంకులు సాధించారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత రమణారెడ్డి ఆదివారం అభినందించారు.



విద్యార్థులను అభినందస్తున్న సరస్వతి విద్యాసంస్థల అధినేత రమణారెడ్డి

విద్యాసంస్థల డైరెక్టర్లు ఎ.గణేష్‌రెడ్డి, ఎ.గంగాశంకర రెడ్డి, సీఈఓ ఎన్.వి.సురేష్, డీన్స్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

అనుమానాస్పద వ్యక్తులతో జాగ్రత్త


వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న ఎస్‌ఐ శివరామయ్య

మద్దిపాడు: ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు తిరిగితే సమాచారం అందించాలని ఎస్సై శివరామయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్‌స్టాప్ వద్ద ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా వాహనదారులతో ఆయన మాట్లాడుతూ.. దేశంలో యుద్ధ వాతావరణం ఉన్న నేపథ్యంలో ప్రతి బస్ స్టాండ్ వద్ద, రైల్వే స్టేషన్‌ల వద్ద కార్లు మోటర్ సైకిళ్లు ఆపి తనిఖీలు చేస్తున్నామన్నారు. హెల్మెట్లు లేకుండా వాహనాలు నడుపరాదని, కార్లు నడిపే డ్రైవర్లు సీటు బెల్టు ధరించాలన్నారు. వేసవి సెవులకు వచ్చిన చిన్నారులకు వాహనాలు ఇవ్వరాదన్నారు. చిన్నారులకు వాహనాలు ఇస్తే ఏదైనా ప్రమాదం జరిగిన క్రమంలో వారికి వాహనం ఇచ్చిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమలో ఆయన వెంట పలువురు వాహనదారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనరసింహ స్వామి జయంతి


అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి


నరసింహస్వామి పారాయణలో మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో: వైశాఖమాసం ఆదివారం లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఒంగోలు నగరంలో కేశవస్వామి పేటలోని ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో, గడియారం వారి వీధిలో, అనంత కోదండరామ స్వామి మందిరంలో, సంతపేట సాయిబాబా మందిర ప్రాంగణంలో విగ్రహ దాతలు కోటపోతల నరసింహారావు, భక్తుల చేత ఆలయ అర్చకులు సామూహికంగా పంచామృత అభిషేక తులసి పూజ క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో, గడియారం వారి వీధిలో అనంత కోదండ రామస్వామి మందిరంలో బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో దేశ రక్షణను కాంక్షిస్తూ నరసింహ స్వామి కరావలంబ స్తోత్ర పారాయణం చేశారు. నళినీ కూచిపూడి నృత్య అకాడమీ శివకుమారి బృందం, సాయి మహిళా విభాగంచే సామూహికంగా పారాయణం నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు అందరికీ తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ అళహరి చెంచలరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

సంతనూతలపాడు: వేసవీలో దాహం తీర్చడం అభినందనీయమని వాసవీ క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో క్లబ్ జిల్లా ప్రతినిధి గ్రంధి లక్ష్మీ ప్రసాదరావు, సులోచన దంపతులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ కూలింగ్ చలివేంద్రం వద్ద ఆదివారం క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాద్ రావు, నాగమణి దంపతులు మజ్జిగ పంపిణీ చేశారు. మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డీవీ రమణారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వేమూరి వెంకట శేషారావు, గౌరవాధ్యక్షుడు పాదర్తి గిరి, ఉపాధ్యక్షులు వేమా శీను, సెక్రెటరీ వేమూరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు


మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ

సంతనూతలపాడు: స్థానిక సుందరయ్య భవనంలో ప్రకాశం బాలోత్సవం వేసవి వినోదం కార్యక్రమంలో భాగంగా మూడో రోజు ఆదివారం చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. ఈక్లాసుల్లో జాతీయ జెండా తదితరాల బొమ్మలు వేయడం పిల్లలకు నేర్పించారు. కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి ఎస్ మాలతి, మండల కోశాధికారి కే బుజ్జి, టీచర్ రాధ, విద్యార్థులు టీ పద్మ, అక్షయ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం

పెద్దారవీడు: మండలంలోని సానికవరంలో కోదండరామస్వామి దేవస్థానం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించారు. పోతులూరి శివరామాచార్యస్వామి సిద్ధాంతి, సంగుభట్ల వెంకట రమణమూర్తి ఆధ్వర్యంలో ఉదయం గం.6.48 కు ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. మంగళ వాయిద్యాల నడుమ ప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవాచన, ప్రసాద వాస్తు పూజ, గర్తన్యాస, ధాతున్యాస, బీజన్యాసనం, సుమహూర్త యంత్రస్థాపనలు, శిలా విగ్రహ స్థిర ప్రతిష్ఠలు, కళాన్యాసం, ధేనుదర్పణ దర్శనం, శాంతి కల్యాణం చేశారు.


క్రీడాజట్లను అభినందిస్తున్న జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కరరావు, తదితరులు

ప్రతిభ కనబరిచిన క్రీడాజట్లకు అభినందనలు

ఒంగోలు: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచిన క్రీడాజట్ల అభినందన సభ ఆదివారం స్థానిక హైదరీ క్లబ్‌లో జరిగింది. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి 12వ బీచ్ కబడ్డీ పురుషుల విభాగం సీనియర్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానం, పులివెందులలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ బాలుర విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచిన జట్లకు ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కుర్రా భాస్కర రావు తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, ఆర్థిక సాయం అందించేందుకు సంఘం ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. క్రీడాకారులకు అవసరమైన నైపుణ్య శిక్షణ క్యాంపులు నిర్వహణ, అవసరమైన క్రీడా సదుపాయాలు కూడా ఏర్పాటు చేసే విషయంలో అసోసియేషన్ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా రెండు క్రీడాజట్లలోని క్రీడాకారులకు కోశాధికారి డి.రమేష్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఎం. చంద్రమోహన్‌రెడ్డి, కార్యదర్శి వై.పూర్ణ చంద్రరావు, ఉపాధ్యక్షులు శిరిగిరి రంగారావు, చిన్నారి సురేష్, పి.చంద్రశేఖరరెడ్డి, సంయుక్త కార్యదర్శి వై.చెన్నయ్య తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.